# పాత నేస్తం

*Bhargavi Rao*

This page uses Unicode. If your computer does not display Telugu script, please read and enjoy the pdf version. If you would like to set your computer up to display Telugu Unicode, please see help here

పుస్తకాలు సర్దుతుంటే

అనుకోకుండా దొరికింది

నా పాతనేస్తం

ఆర్తిగా తడిమి ముద్దుపెట్టుకున్నాను

ఓ ఇరవై ఏళ్ళ క్రితం కలిసి

నా మనసులో మనసై నన్ను

ప్రేమలో ముంచెత్తిన – నా నేస్తం

ఎవరికళ్ళూ పడకుండా

దాచుకున్నా – "కృష్ణపక్షం"

దాన్ని కృష్ణశాస్త్రి రాసారంతే

ఆ భావాలన్నీ నావే

ఆ రెల్లుపూల పానుపు

జల్లు జల్లుగా కురిసిన వెన్నెల

నా కలలు జలపాతాలే!
అప్పట్లో వెతికి వేసారి

నిరాశతో కృంగిపోయాను

మళ్ళీ ఇలా కనిపించగానే

తబ్బిబ్బవుతూ పేజీలు తిప్పాను.

వయస్సులాగే వన్నెతగ్గి

రంగువెలసిన పుటల్లో

పచ్చగా పలకరిస్తున్న అనుభూతులు!
నెమరేసుకుంటూ వెనక్కివెళ్తే . .

ఆ పేజీలో

మధు ముద్దుపెట్టుకుని

నాకిచ్చిన ఎర్రగులాబీ

వెచ్చటి గుండెలమధ్య

పెట్టుకుని పుస్తకంలో దాచాను

రంగు వెలిసిన

తీపిజ్ఞాపకం!
మధు మళ్ళీ ఎవరినైనా ప్రేమించాడా?

మరోపేజీకింద

జానకి ఇచ్చిన అద్భుతమైన నెమలిఈక

అది పెరుగుతుందంటే

రోజూ తడిమి చూసేదాన్ని

పెరిగినట్లే అనిపించేది.
జానకి ఎలా ఉందో ఎక్కడుందో!

ఆ తర్వాత పేజీలో

పెన్సిలు చెక్కిన పువ్వుపొట్టు

నేనూ మురళీ పెన్సిలు అరగదీసి

బోల్డుతీసాము – పాలుపోసి

కలిపితే రబ్బరు అవుతుందన్నాడు

ఇద్దరం కలిసి రాసిన

అందమైన ప్రేమలేఖ

ఎవరికివ్వాలో తెలీక పుస్తకంలోదాచాము

మురళికి పెళ్ళయిందా?

అలా మరోపేజీ

కళ్ళు చెమర్చి కన్నీళ్ళకు

కరిగిన అక్షరాలు

అక్షర లక్షలు విలువచేసే
బాల్యస్మృతులు . .  నా నేస్తాన్ని
అపురూపంగా గుండెలమీద
పెట్టుకుని కళ్ళుమూసుకున్నాను . .

Post your comments on this article